# తలకొరివి



ఆ రోజుకు సరిగ్గా రెండు నెలలయింది మా వారు నా మొగం చూడక! ఇంటి కోడలుగా నేను ఆ ఇంట్లోకి అడుగు పెట్టి ఆరు నెలలైనా కాలేదు. ఆ లోపుగానే మా ఇద్దరి మధ్య ఎడబాటు. కారణం– ఆయన ఉద్యోగనిర్వాకం. నేను ఆయనముందు తలవంచి తాళి కట్టించుకునేవరకు శ్రీవారు యం.ఎ.లో బంగారు పతకాన్ని సాధించి కూడా ఉద్యోగం కోసం పరిస్థితుల ముందు తలొగ్గక తప్పలేదు. అంతో ఇంతో భూ వసతి కలిగిన కుటుంబం. మామగారు వ్యవసాయం పనులు చూసుకొంటున్నారు. మరిది ఆ సంవత్సరమే కాలేజీలో అడుగుపెట్టాడు.

ఇంక అత్తగారు ఆమధ్య ఎప్పుడో పొలాల్లో నడుస్తూ ఎత్తయిన గనిమ నుండి దిగుతూ జారిపడ్డారట. దాదాపు ఆమె మంచానికే పరిమితమైపోయింది. వైద్యం ఆమె బతుక్కు కేవలం ఒకనైవేద్యంగా మిగిలి పరీక్షించిన కారణంగా! ఆ మాటకొస్తే నా అత్తగారింటి పరిస్థితి పుట్టింటికే మాత్రం భిన్నంగా లేదు.

ఒక పేదకుటుంబంలో పుట్టి అధ్యాపక వృత్తి ద్వారా మధ్య తరగతికి ఎదిగినవాడు నా తండ్రి. ఆయన అడుగుజాడల్లోనే నడిచింది నా తల్లి. వాళ్ళది ఆదర్శదాంపత్యం. పసిమనస్సుల్లో పాదులుకట్టి విజ్ఞానబీజాలను మొలకెత్తిస్తూ ఇద్దరూ ఉపాధ్యాయులుగానే జీవిస్తున్నారు.

ఒకరోజు అమ్మబడినుండి ఇంటికి నడిచివస్తూ ఉంటే ఎవడో వెనుకవైపు నుండి స్కూటర్‌తో గుద్దేసి పారిపోయాడు. ఆ దెబ్బతో ఆమె బంతివలె ఎగిరి ఒక రాతిమీద పడింది. తల పగిలింది.

రూపాయను పైసావలె ఖర్చుపెడితే ఆమె బతికింది. కానీ మందులు ఆమెను మతిభ్రమణం నుండి కాపాడలేక పోయాయి!

ఆ కారణంగా నేను కాలేజీలో పెట్టిన అడుగు వెనక్కి తీసుకోవలసి వచ్చింది. ఆ వయస్సుకే కుటుంబ నిర్వహణ. పుట్టింట్లో అనుభవం ఒక కూతురుగా. అత్తగారింట్లో ఒక కోడలుగా. పెద్ద వ్యత్యాసంలేని అనుభవం. వారాలు తిరగక ముందే అందరి అభిమానాన్ని పొందగలిగాను.

అప్పుడే మావారికి ఉద్యోగం వచ్చింది.

కోడలు ఇంట్లో అడుగు పెట్టిన వేళావిశేషమని ఊరు మెచ్చుకొనింది. పుట్టింటికి లక్ష్మి!... మెట్టి నింటికి అదృష్టవంతురాలు!!

నేను ఆడపిల్లగా పుట్టినప్పుడు నా తల్లిదండ్రులు 'ఇంటికి లక్ష్మి' అని సరిపెట్టుకొని సంతృప్తి పడివుంటారు. అది ఎవరికైనా తప్పదు. 'అయ్యో! ఆడపిల్లే! అని నోట్లో రెండు వడ్లగింజలేసే పాపానికి ఒడిగట్టలేరు కదా? ఇప్పుడు అదృష్టవంతురాలు అంటున్నారు లోకులు.

మా అయ్య అష్టకష్టాలు పడి వెసులుబాటు చూసుకొని ఇల్లు కట్టుకోవాలని కొనిపెట్టిన అరవై అంకణాల ఇంటిస్థలాన్నీ... కట్నాలు కానుకల కింద యాభైవేల రొక్కాన్ని వరకట్నంగా సమర్పించి పుట్టింటికి లక్ష్మినయ్యాను.

మెట్టినింట అదృష్టం చూడాలి కదా!

నాలో నేను నవ్వుకున్నాను.

ఆ నవ్వుమీద సవాలు 'విసిరినట్లుగా మా వారు ప్రయాణం కట్టారు- ఉద్యోగంలో చేరడానికి. ఇంట్లోనే కాదు- ఆ ఊళ్ళో అందరికీ ఆనందంగా ఉంది. నిజం ఆఊళ్ళో ఒకవ్యక్తి ఉద్యోగం సంపాదించుకోవడమంటే అది ఒక అపురూపమైన విషయం.

అయితే నా పరిస్థితి?... వారాలు తిరగలేదే? ఒంటిమీద పసుపుమరకలు మాయలేదే? ఈ ఎడబాటు ఎలా భరించను? జిహ్వకు రుచి తెలియకనే ఉండాలి. తెలిసిన తర్వాత అజీర్తి చేస్తుందన్న ఆలోచనకు తావే ఉండదు. మంచి పదునుమీదున్న కత్తిని విసిరి మూలకు పారేసినట్లే కదా నా గతి? గుండెలు బరువెక్కాయి! కండ్లు ధారగా వర్షిస్తున్నాయి! గదిలోకి పారిపోయి కుప్పగా కూలబడి ఏడుస్తున్నాను- వెక్కివెక్కి!

ఆ ఏడువు నా ఓపికను పరీక్షించేవరకు అవకాశం ఇచ్చి అప్పుడు ఆయన వచ్చారు.

నన్ను చూస్తూ ఒక్కక్షణం నిశ్చేష్టుడై నిలబడ్డారు. ఆ తర్వాత ఒక్క ఊపులో వచ్చిన నామీద పడినట్లుగా నా రెండు భుజాలను పొదివిపట్టుకుని అమాంతంగా పైకి లేపారు.

నేను ఆయన ఎదమీద అలానే వాలిపోయాను.

నా ఏడుపు కట్టలు తెంచుకొనింది.

ఆయన నన్ను అలానే ఎదకు హత్తుకొన్నారు.

నా తల నిమురుతూ శాంతివచనాలు వల్లిస్తున్నారు- మండుతున్న మంటలమీద మంచినీళ్లు- స్ప్రే చేసినట్టు!

ఆయన ఎదమీదవాలి వెక్కివెక్కి ఏడ్చి కన్నీళ్లతో తనగుండెలను తడిపేసరికి కొంతకు కొంత ఊరట కలిగింది. అలా తేరుకున్న స్థితిలో-

"ఏమండీ? నన్నుకూడా మీతో తీసుకొని పొండి. మిమ్మల్ని విడిచిపెట్టి నేను ఒక్కక్షణం కూడా బతకలేను." అంటూ ప్రాధేయపడ్డాను.

"పిచ్చిదానా? ఇప్పటి నీ పరిస్థితి ఎంతో నా పరిస్థితి అంతకంటే ఎక్కువే కదా! లేదంటే నువ్వు బయటపడ్డావు. నేను పడలేకపోతున్నాను. ఒక్కసారి ఇంటి పరిస్థితిని గమనించు. ఈ పరిస్థితిలో అమ్మానాన్నను వాళ్ళగతికి వాళ్ళను వదిలేసి మనం వేరే కాపురం పెడ్తే లోకులు కాకులు. ఎన్నెన్ని విధాల ఎత్తిపొడస్తారో గ్రహించు. అయినా ఈ రోజుల్లో రెండువందల కిలోమీటర్లు పెద్ద దూరమేమీ కాదు. మూడు నాలుగు గంటల ప్రయాణం. ఏమాత్రం వీలుచిక్కినా రెక్కలు గట్టుకుని వచ్చివాలనా?"

ఆడదాని మనస్సు ఒక మైనపు ముద్ద. ముద్దు ముద్దు మాటల్తో దాన్ని కావలసిన రీతిలో మలుచుకోవచ్చు. అవసరమైతే వెలిగించుకోవచ్చు.

నేనూ ఆడదాన్నే. అనాదిగా రాజుకుంటున్న పొయ్యిగుండెతో రాజీపడుతున్న ఆడజాతికి వారసురాలినే. ఆ మాటలతో రాజీపడక తప్పలేదు. ఆయన ఉద్యోగానికి వెళ్ళిపోయారు- ఇంటి పెద్దకోడలి కిరీటాన్ని నానెత్తికి అలంకరించి!

ఏదో పోగొట్టుకొంటున్నట్లుగా... వెలితిగా... గుండెల్ని రెక్కల పురుగులు అదేపనిగా తొలుస్తున్నట్లుగా... బతుకు నిస్సారంగా... ఒక్కదినం గడవడం గండం గడిచి పిండం బయట పడినంత పనిగా ఉంది.

అయితే ఆయన మాట తప్పలేదు. వారం పదిరోజులకొకసారి వస్తున్నారు. వచ్చినపుడు మాత్రం ఆ ఒకటి రెండురోజులు స్వర్గమే దిగివచ్చి మా నట్టింట కాపురం పెట్టినట్లుండేది.

మనిషి సర్వస్వాన్ని మరిచి ఒక అలౌకిక స్థాయిని చేరుకోవడానికి ఆనందానికి ఆ శక్తి ఏ శక్తి అనుగ్రహించిందో? అది ఒక ఊహాతీతమైన అద్భుతం. నా వరకు వచ్చేటప్పటికి అది ఎంతసేపు? ఒకటి రెండు దినాలు. ఒకటి రెండు క్షణాల్లో గడిచిపోయినట్లుంటే కథ మరలా మొదటికి. నేను ఏడవడం... ఆయన ఓదార్చడం.... పరిస్థితులతో రాజీపడక తప్పక

పోవడం... ఆయన బయలుదేరడం. 'అయ్యో! ఇంత త్వరగా వెళ్ళిపోయారే!' అని ఆలోచిస్తూ కూర్చోవడానికి తావు ఇవ్వకుండా ఇంటి బాధ్యతల్లో విధిగా తలదూర్చడం. బాధోపశమనం పొందడం.

కాలరథం. దేవుడే ఎక్కిన రథాన్ని లాగడానికి భక్తుల అవసరం ఉంది. కానీ దీనికి ఎవడి అవసరమూ లేదు. తన దారి తనది.

వాడు ఎంతటివాడైనా కావచ్చు. ఆ దారిని బుద్ధిగా అనుసరించవలసిన వాడే!

ఒక గాడికి అలవాటుపడిన జీవితం యాంత్రికంగా ముందుకు సాగిపోతూ ఉంది.

అయితే నెలలు తిరగముందే మా వారిలో వచ్చిన మార్పు మాత్రం నేను ఎదురుచూడని దెబ్బ. వారం పదిరోజుల కొకసారి రెక్కలు గట్టుకొని వచ్చి వాలుతూ ఉండిన మనిషి రెండు మూడు వారాల కొకసారి... ఆ తరువాత నాలుగైదు వారాల కొకసారి– కడపటికి రెండు నెలలకొకసారి రావడమే కష్టమయింది. అడిగితే ఏవేవో కుంటిసాకులు!...

నిజం చెప్పాలికదా! ఉప్పు కారం తింటున్న జన్మ. ఒక విధమైన బాధ. ఏదో అస్పష్టమైన వేదన. సుఖ సంబంధమైన తీవ్రజ్వాల గుండెల్లో రక్తనాళాలను నిర్దయగా తెంపి కట్టగా కట్టి కోత కోసినట్లుండేది. నిగ్రహం నిత్యజీవితంలో నా పాలిటికొక పరీక్షగా పరిణమించింది.

ఎంత నిగ్రహించుకున్నా మనసు పిచ్చిపిచ్చిగా ఆలోచించేది. ఏంచేయాలి? ఒకరితో చెప్పుకునే విషయమా? కాదే! ఆవేశాన్ని చన్నీటితో చల్లపరచుకొనేది. పడకమీద పడిపొర్లుతూ తలగడలో ముఖం దాచుకుని తనివితీరా ఏడ్చుకొనేది.

అప్పటికీ సిగ్గువిడిచి రెండుమూడు సార్లు తనతో చెప్పుకొన్నాను. ఊహూఁ! లాభం లేకపోయింది.

నాకు రోజులు లెక్క పెట్టుకోవడం తప్పలేదు. కష్టాలకు కన్నీళ్ళకు సంబంధం ఉన్నట్లే కాలానికి ఉన్నట్లుంది. జీవితం హాయిగా సాగిపోతూవుంటే రోజులు గడవడమే తెలియదు. అదేకష్టాల్లో రోజులు లెక్కపెట్టుకోవడం తప్పనిసరి! ఆ రోజుకు రెండునెలల పైన ఒక్కవారం గడిచింది.

ప్రతిరోజూ వస్తాడు!... ఇదో వస్తాడు!!... అన్న ఎదురుచూపులు. ఎదురుచూసి ఎదురుచూసి నిట్టూర్పుల పొగల సెగలు. పగలు ఏవో పనిపాటలతో గడిచి పోతున్నా రాత్రుల్లో నిరీక్షణ నా పాలిటికొక శాపం.

మనిషిని చంపకుండా చంపే శక్తి ఈ శరీరంలోనే పుట్టి ఈ శరీరాన్ని దహించడం ఒక అద్భుతం. ఈ పరిస్థితికి మహామహా మునిపుంగవులే దాసోహం అన్నారంటే అన్నిసుఖాలకు అలవాటుపడిన నా పరిస్థితి?

ఆ కోరికను జయించడం దుర్భరంగా ఉంది.

తనకు చేతనైనరీతిలో నామీద కక్షసాధించి ఆరాత్రికూడా గడిచిపోయింది.

తెల్లారింది.

ఆ రోజు ఎందుకో ఏమో కానీ ఆయన తప్పక వస్తారని మనసు చెప్తూఉంది.

ఆ నమ్మకంతో ప్రారంభమైన రోజు చకచకా గడిచిపోతూ ఉంది. పొద్దు వాటారింది. ఆయన జాడ లేదు. అయినా ఆ సాయంకాలానికో రాత్రికో వస్తాడన్న పిచ్చినమ్మకం. ఆ పిచ్చితోనే సాయంకాలం స్నానంచేశాను. ఆయనకు నచ్చిన చీరనే ఎంపికచేసి కట్టుకొన్నాను. తలదువ్వుకొన్నాను. తలనిండుగా మల్లెపువ్వులు తురుముకొన్నాను. ఒళ్ళంతా కండ్లుచేసుకొని ఆయనకోసం ఎదురుచూస్తున్నాను.

ఎదురు చూడడం ఒక శాపం. ఒక శిక్ష. కాదనుకుంటే ఒక వరం!

నా మట్టుకు నాకు ఆయనకోసం ఎదురు చూడడం ఒక వరంగానే ఉంది.

నేను ఎదురుచూస్తూనే ఉన్నాను. ఎవరికోసం ఎదురుచూడని పొద్దు గూట్లో పడింది. ప్రకృతి పురుషుడు చీకటి నేత నేయడానికి పూనుకొన్నాడు. ఆ నేతలో పొదిగిన సరిగ పువ్వుల్లా ఆకాశంలో కోట్లాది చుక్కలు- నా గుండెల్లో కోర్కెల్లా!-

ఈ కోర్కెలకు అతీతులుగా అత్తమామలు. వాళ్ల సంసారము వాళ్ళకు జరగవలసిన సపర్యలు. వాళ్ళ ఆలోచనలు అంతవరకే పరిమితం. అంతకు మించి వాళ్ళనుండి ఆశించడంలో అర్థమే లేదు. నా పిచ్చి నాది. వాళ్ళ పిచ్చి వాళ్ళది. అందుకే అత్తామామలకు అన్నాలు వడ్డించాను. తృప్తిగా తిన్నారు. హాయిగా పడుకొన్నారు.

నా పరిస్థితి అందుకు భిన్నంగా ఉందికదా!

ఈ రోజు ఆయన వస్తాడన్న నమ్మకం అణుమాత్రం సడలలేదే? 'ఆయన తప్పక వస్తారు' అని పిచ్చిమనసు కొటకలాడుతూ ఉంది. వస్తే ఇద్దరూ కలిసి ఒకరికొకరు తినిపించుకుంటూ... తీయగా కబుర్లు చెప్పుకోవచ్చు అనే కోరిక. ఆ కోరికతోనే నా గదిలో పడుకొన్నాను- ఏ క్షణాన అయిన ఆయన రావచ్చునన్న ఆశతో!

ఉదయం నుండి ఎదురుచూసి ఎదురుచూసి విసిగిపోయిన మనసు నిజంగా అలిసిపోయింది. అలసటలో ఆరాటం. ఆరాటంలో పొందని పడక. ఆయన రాలేదు. వస్తాడన్న నమ్మకం సడలలేదు. ఆ నమ్మకంతోనే నా గదిలో పడకమీద పడి పొర్లాడుతూ!

కోరికలు లేలేత చిగుళ్ళు తొడుగుతున్నాయి. శరీరం తేలిపోతున్నట్లు... నరాలు తెగుతున్నట్లు.... ఒకే ఒక్క ఎగురు ఎగిరి ఆయనలో లీనమైపోవాలన్న తపన. ఆ తపనకు సాక్షి చేతుల మధ్య నలుగుతున్న దిండు!

ఆ స్థితిలో కలత నిద్ర చిత్రంగా ఆవరించింది. ఆయన వచ్చారు. తాను చేసిన తప్పుకు క్షమాపణ కోరుతున్నట్లుగా మౌనంగా అతి దీనంగా నా ముందు మోకరిల్లారు. నేను ఆబగా ఆత్రుతగా ఆయన్ను నా బాహువలయంలోకి లాక్కొని బంధించాను. తానే నేను నేనే తానుగా.

ఆ ఇంటిపరిధులకు... పరిస్థితులకు స్వస్తి పలికి... సుఖదుఃఖాలను అధిగమించి... ఆవహించిన విరహచింతనను ఆవహేళన చేస్తూ...

ఎక్కడో సుదూర తీరాల్లో... వెన్నెలవాగులో... రాధామాధవులై... సౌందర్యస్నాతులై!... ఆ అనుభవం!... ఆ తృప్తి!!... ఓహ్!!!

సలసల కాగిపోతున్న పెనాన్ని చన్నీటిలో ముంచిన అనుభూతి.

మత్తువదిలింది. మనసు తేలికపడింది. ఆనందానికి సాక్షిగా కన్నులు అరమోడ్పులయ్యాయి.

అడుగుమీద అడుగ్గా ఆ గదిలో నుండి పిల్లిలా జారుకొంటున్నాడు మామగారు! ఎక్కడో ఒక అమాయక గుండెల్లో బాకు నిర్దాక్షిణ్యంగా దిగింది.

ఒక తీతువు పిట్ట దీనంగా అరిచింది.

ఎంత మోసం?... ఎంత ద్రోహం?... ఇంతకూ ఆ పెద్ద మనిషి కూసిన కూత?

ఆయన ఉద్యోగానికై ఇల్లు విడిచి వెళ్ళి వారం దినాలైనా కాలేదు. ఒక రోజు మధ్యాహ్నం భోజనాలయ్యాయి. అత్తమ్మ అంతకు మించిన సుఖమే లేదన్నట్లు మంచమెక్కింది.

నేను నా గదిలో. పైన పంకా తిరుగుతూ ఉంది– తేనెటీగ పాటలా! నిముషాలు గంటలూ వెనక్కూ ముందుకు పరుగులు తీస్తున్నట్లు... అనుభవానికి వచ్చి అంతలోనే దూరమైన తీపి అనుభవాల అనుభూతిని నెమరువేస్తూ.... చేతిలో పత్రిక పుటలు యాంత్రికంగా తిరుగుతూ– ఏదో అలికిడి. తల పైకెత్తాను. 'అరె! మావారు వచ్చేశారే?' అన్న భ్రమ. అయితే ఎదురుగా మామగారు.

నాలుక కరుచుకున్నాను– ఆ ఒక్క సందర్భంలోనే కాదు. ఎన్నో తడవలు.

కారణం అబ్బా కొడుకులు ఇద్దరూ అచ్చం కవలపిల్లల మాదిరే ఉంటారు!

మనిషిని పోలిన మనుషులుంటారు. అది సహజమే. అయితే తండ్రీ కొడుకులు ఇద్దరూ ఒకరిని చూసినట్టు ఇంకొకరుండడమే అసాధారణం. అయినా అది నిజం. ఈయనే ఆయన. ఆయనే ఈయన. అని తడబడిన సందర్భాలెన్నో!

ఆ భ్రమనుండి బయటపడి తొట్రుపడుతూ లేచి నిలబడ్డాను.

సాధారణంగా తానేమో తన పనేమోగా... మనిషి ముభావంగా... మాట ముక్తసరిగా ప్రవర్తించిన మనిషి అనుకోనట్లుగా నా గదిలోకి రావడమంటే నాలో లెక్కలేనన్ని సందేహాలు. ఆ బరువుతో తల వాలిపోయింది.

'చూడమ్మా! ఈ ఇంటికి కోడలైనా కూతురైనా నువ్వేనమ్మా!'

అంత మాటన్న మనిషి ఎంత నమ్మకద్రోహానికి తలపడ్డాడు.

హుం! మనిషి సాటిమనిషిని వంచించడానికి ఎంతజాగ్రత్తగా ఆలోచిస్తాడు. అయితే వంచనకు లోనయ్యే వాడుకూడా మనిషే కదా! మనిషిగా వాడూ ఆలోచించగలడుకదా? అయితే ఇద్దరికీ మధ్య నమ్మకం ఒకటి ఏడ్చిందే? ఆ నమ్మకంతోనే కదా లోకం ముందుకు సాగుతూ ఉంది. అందువల్ల నమ్మడం నమ్మకపోవడం అనేది పూర్తిగా పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది.

నా ఇంటి పరిస్థితులు నన్ను నమ్మించాయి.

అమాంతంగా నట్టేట ముంచాయి!

లేకపోతే–

'ఈ ఇంటి కోడలైనా కూతురైనా నువ్వేనమ్మా!'

అన్నమాట శ్రావ్యమైన పాటలా చెవిలో ఆపాతమధురంగా ఉంటే ఆ రోజు నేను తల పైకెత్తి ఆయన ముఖాన్ని చూశాను. ఆ ముఖం ప్రసన్నంగా అంతకంటే గంభీరంగా ఉంది. ఇంకా ఏమి చెప్తారో అన్న ఆత్రుతతో అలానే ఆయన ముఖంలోకి చూస్తూ నిలబడ్డాను.

"వాడితో కూడా నిన్ను కాపురానికి పంపకపోవడం ఏవిధంగా చూసిన తప్పే. ఏ వయస్సుకా ముచ్చట. నాకూ బాధగానే ఉంది. అయినా ఇంటి పరిస్థితిని చూస్తూనే ఉన్నావుకదా! మనిషి ఎంత మంచివాడైనా పరిస్థితులకు తలవంచినపుడు వాడు స్వార్థుడి కిందే లెక్క. నాది స్వార్థమే. అయినా మాదేముంది? పొద్దు వాలిపోయిన బతుకులు. రానురాను నాలోగూడా ఓపిక సన్నగిల్లి పోతూఉంది. ఇది నీఇల్లు. ఇది నీసంసారం.

నేను చెమటోడ్చి సాధించిన ఈ స్థితి కేవలం మీ భవిష్యత్తుకు పునాది మాత్రమే. ఈ పునాదుల మీద మిద్దెలూ మేడలూ కట్టుకోవలసిన బాధ్యత నీమీద ఉంది." అంటూ ఇంటి తాళాలు చేతికిస్తాడా? అంటే– ఇంటి బరువుబాధ్యతలన్నీ నా పరమైనట్లే కదా? ఒక ఇంటి పెత్తనం చేతికి రావడమంటే అది ఎంత గర్వకారణం?

ఈ అపోహలోకి నన్ను నెట్టడం ఇంత దుర్బుద్ధి కడుపులో పెట్టుకొనేకదా! సమ్మోహనాస్త్రాన్ని అతి తెలివిగా సంధించాడు. తల్లిచాటు బిడ్డలా తయారయ్యాడు. చిన్న విషయాన్ని పనికట్టుకుని వచ్చి అదేపనిగా చెప్పడం...ఏ పని చెయ్యాలన్నా సంప్రదించడం...అమ్మడం...కొనడం... డబ్బులు దాచిపెట్టడం– ఒక మాటలో చెప్పాలంటే ఇంట్లో గాలి ఆడాలన్నా నా ప్రమేయంతోనే అన్న వాతావరణాన్ని అతి చాకచక్యంగా సృష్టించాడు. ఆ నమ్మకంతోనే నా బలహీనతమీద దెబ్బ తీశాడు!

ఈ బలహీనతకు కారణం?

మా ఇద్దరి మధ్య ఎడబాటు కల్పించింది కూడా ఈ దుష్టబుద్ధే! అవును. అప్పుడు ఇంత లోతుగా ఆలోచించడానికి అవకాశం లేకపోయింది. ఆ అవసరం కూడా లేకపోయింది. ఆ దూరాలోచనలో ఇంత దురాలోచన దండలో దారంలా ఉందని ఇప్పుడే గదా తెలుస్తూ ఉంది.

ఆ రోజు మా వారికోసం ఎదురుచూస్తూ నేను గదిలో ఆయన వస్తే అనుభవానికొచ్చే అనుభూతుల స్మృతి. చైతన్యవంతమైన మనస్సు శరీరాన్ని అచేతనంగా పడకమీద పడుకోబెట్టి ఆగదిని అందాల పొదరిల్లుచేసి మల్లెలు పూయించాలని మథనపడ్తూ ఉంది. ఆ మథనలో పరవశత్వం. కన్నులు మూతపడ్డాయి. నేను నిద్రపోతున్నాననుకున్నాడేమో!

"ఏవిరా? మూడుమూన్నాళ్ళకు నువ్విట్లా పరుగెత్తుకొని వస్తావుంటే ఆ వచ్చే జీతం దుడ్లు నీ చార్జీలకే సరిపొయ్యేటట్టుంది గదరా? ఈ మాత్రానికి అక్కడికెక్కడికో పొయ్ ఉద్యోగం వెలగబెట్టే దెందుకు? ఇక్కడే ఈ ఉద్యోగం చేసుకుంటే సరిపోదా?"

ఆ మాటల్లో ఎంత వ్యంగ్యం?

నా అనుభూతిని ఎవరో నిర్దాక్షిణ్యంగా చెప్పు కాలికిందేసి కసిగా నుసినుసిగా తొక్కి నలిపేసి నట్లయింది. లేచి కూర్చున్నాను. గుండెవేగం హెచ్చింది.

మా వారు ఏమి బదులు చెప్తారో అన్న ఆత్రుత. ఊపిరి బిగబట్టి వింటున్నాను. మావారు ఉలికీ పలకలేదు.

లేత వెదురుగడను చీల్చినట్లుగా నా మనసు మూలిగింది బాధగా!

'ఈ ఇల్లూ వాకిలీ ఈ సంపాదన నీ తాత ముత్తాతలు గడించి పెట్టిపోయిన గంటుకాదు నాయనా! ఇది నా స్వయార్జితం. ఒక్కొక్క బొట్టుగా ధారపోసిన చెమట ప్రతిఫలం. ఒక్కొక్క పైసాను రూపాయగా కూడబెడ్తే నిన్ను కాలేజీ చదువులు చదివించగలిగినాను. నీ తమ్ముణ్ణి చదివిస్తున్నాను. నలుగుర్లో తలెత్తుకుని తిరుగుతున్నాను. నీ మాదిరి నేనూ ఇంతకు మించిన సుఖం లేదనుకొంటూ పెండ్లాం కొంగు పట్టుకుని తిరగతా ఉణ్ణుంటే?..."

ఆయన నా కొంగు పట్టుకొని తిరుగుతున్నాడా? ఎంతమాట?

ఆ మాటతో బాధ కలిగినా బాధ్యత గుర్తుచేస్తున్నట్లుగానే తోచింది. మా ఆర్థిక పరిస్థితి ఇంకా మెరుగుపడాలని తాపత్రయపడుతున్నాడేమో అనిపించింది. కాని ఎంతజిత్తులమారి నక్క? ఎంత గొప్ప ఎత్తు? ఆలూమగల మధ్య అతి సహజంగా ఎడబాటు కల్పించడం. ఆ ఎడబాటులో బలహీనత. ఆ బలహీనతపై తిరుగులేని దెబ్బ తీయడం!

అయితే ఆ పెద్ద మనిషి కూసిన కూత?

ఆ నయవంచకుడికి ఒక కూతురే ఉండి అది నా పరిస్థితిలో ఉంటే ఆ జంతువు అంత పనికి తెగించేవాడేనా?... ఛీఛీ!

ఆ తరువాత మూడు నాలుగురోజులకు ఎప్పుడో ఆయనగారు దిగబడ్డారు. ఆ మూడు నాలుగురోజులు ఆ కొంపలో పడిన నరకయాతన?

ఆ స్థితిలో అంత కిరసనాయిలు...ఒక అగ్గిపుల్ల...బారెడు తాడు నిజంగానే నన్ను చూసి వెక్కిరిస్తున్నాయి.

'యుద్ధంలోనే గెలుపు ఓటముల ప్రసక్తి. జీవితపోరాటంలో గెలుపే ధ్యేయం. పెనుతుఫానులో చిక్కుకొన్నా నిరాశ నిస్తేజపరుస్తున్నా తీరం పైపు ఈదడమే జీవితం.' అంటూ మా అయ్య పాఠం చెప్పినట్లు చెప్తూ ఉండేవారు.

ఆ మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి.

పోరాటమే జీవితమని నిశ్చయించుకొన్నాను. అయినా ఆ నాలుగుదినాలు ఆ మోసగాడి ఎదుట పడలేక.... పడక తప్పక... పడినా తలెత్తి వాడిముఖం చూడలేక పడిన చిత్రహింస! వద్దురా తండ్రీ వద్దు. పగవాళ్ళకు కూడా ఇటువంటి విషమపరిస్థితి వద్దు.

వద్దు వద్దంటూనే బతకడమే జీవితం.

అందుకే ఆ రాత్రి ఆలుమగలుగా ఆ గదిలో మేమిద్దరం! అయితే ఆయనగారు పట్టెమంచం మీద! నేను పైట చెరగు పడకగా నేలమీద!

నాలుగుదినాలుగా నాలో నేను నలగడం... ఎప్పుడు ఆయన రాపోతారా... అని ఎదురు చూడడం... రాగానే జరిగిన ఘాతుకాన్ని గుండె విప్పి చెప్పుకొని ఆయన గుండెలను కన్నీటితో కడిగి నా పాప ప్రక్షాళన చేసుకోవాలనుకోవడం.... అన్నం కూడా ముట్టకుండా నాలో నేను కుమలడం... అంతా గాలికి కొట్టుకొని పోయింది– ఆయన ప్రవర్తన చూస్తుంటే!.

నెలల తరబడి నన్ను ఒంటరిగా వదిలి చిత్రహింసకు గురిచేసిన మనిషి నిమ్మకు నీరెత్తినట్లు పడుకొని ఉండడం చూస్తుంటే– అమాంతంగా ఆయనపైన బడి పట్టి పైకి లేపి 'దీనికంతకూ కారకుడివి నువ్వేగదా?' అని ఈ చెంపా ఆ చెంపా వాయించాలన్నంత కసి. ఆ క్షణంవరకు ఆ శరీరం కోసం పడిన తపన స్థానంలో ద్వేషం!

ఇంతకూ జరిగింది జరిగినట్లుగా ఆ మనిషితో చెప్పాలా? వద్దా? ఎలా చెప్పేది? ఏమని చెప్పేది? చెప్పకపోతే ఆత్మవంచన. లేదు పరిస్థితులతో రాజీపడి ఆ కొంపలో ద్విపాత్రాభినయం చేయాలా? కాదు. వల్లకాదు. వీలుకాదు. పోనీ! చెప్తే ఆ తండ్రిచాటు బిడ్డ నమ్ముతాడా? సందేహమే. సందేహంలో భయం. భయంతో ఒళ్ళంతా చెమటలు. నమ్మకుండా పోతే ఎదురయ్యే పరిస్థితికి పరిష్కారం? ఎలా? భవిష్యత్తు పెద్ద ప్రశ్నార్థకంగా ఒక సవాలు!

పరస్పర విరుద్ధమైన భావ సంఘర్షణలో ఆ గదిలో గాలి స్తంభించినట్లు... ఊపిరి ఆడనట్లు... కాలం కదలలేక పురిటినొప్పులు పడుతున్నట్లు! తాను రానే వస్తే తనకంటే ముందుగా నేను– పట్టెమంచాన్ని మా ఆనందానికి కేంద్రబిందువుగా తీర్చిదిద్ది ఎదురుచూపే శ్వాసగా! అటువంటి దాన్ని చీరకూడా మార్చుకోకుండా కటికనేలపై పడుకోవడానికి కారణం తాను ఊహించగలడా? ఊహ కందని ఈ మార్పుకు కారణం తన తండ్రే అని అనుకోగలడా?

అదెలా సాధ్యం? అందుకే అతడు దిగివచ్చాడు పట్టెమంచం మీదనుండి నేలమీదికి. ప్రక్కన కూర్చున్నాడు. నన్ను ప్రసన్నం చేసుకొనే ప్రయత్నంలో నామీద చేయివేశాడు.

నేను విదిలించి కొట్టాను.

అది ఎదురుచూడని దెబ్బ. ఆ దెబ్బతో మనిషి విలవిల్లాడిపోతుంటే–

"అబ్బాకొడుకులకిద్దరికీ కొంగువేసే హీనస్థితిలో నేను లేను" అన్నాను.

నా చెంప ఛెళ్ళుమనింది.

అది నేను ఎదురుచూసిందే. ఎదురుచూడనిది ఎదురైనప్పుడే కదా బాధ. ఎప్పుడూ నామీద చెయ్యి చేసుకోవడం ఎరగని మనిషి చేయి చేసుకున్నాడని కాదు నా బాధ. ఎన్ని ప్రమాణాలు చేసి చెప్పినా నా మాట నమ్మకపోవడమే నన్ను కుంగదీసింది. పైగా–

"ఇంత మాటనడానికి నీకు నోరెట్లాడిందే బుద్ధి హీనురాలా? నా తండ్రి నిప్పులాంటి మనిషి. ఆయన మీద మోపరాని నింద మోపుతావా? ఇదంతా నీ కుట్ర. వేరేకాపురం పెట్టాలని నువ్వు పన్నుతున్న పన్నాగం. వేస్తున్న పాచిక. ఈ పప్పులన్నీ నా దగ్గర ఉడకవే. తండ్రీ బిడ్డను

వేరుచేయాలని వల పన్నుతున్న నువ్వొక చిత్రాంగివే! ఛీఛీ! నీ ముఖం చూడడం కూడా తప్పే!" ఈటెల్లాంటి మాటలతో నా గుండె తూట్లు పొడిచి వెళ్ళిపోయాడు.

ఏ ఆడదానికి ఎదురుకాకూడని విషమపరిస్థితి! ఆ తర్వాత-

"మీరు నమ్మినా నమ్మకపోయినా జరిగింది మాత్రం వాస్తవం. ఆత్మవంచన చేసుకొని అబద్ధం చెప్పాల్సిన కర్మ నాకు పట్టలేదు. జరిగింది జరిగినట్లుగా మీతో చెప్పాను. ఇప్పుడు నిర్ణయం మీ చేతుల్లో ఉంది. ఒక్కక్షణం ఈ కొంపలో ఉండడం జరగదు. మీతో రమ్మంటే వస్తాను. కాపురం చేస్తాను. లేదంటే నా దారి నేను చూసుకొంటాను".

ఇదీ నా వాదన!

"పెండ్లాం! ఒకటి గాకపోతే ఇంకొకటి. అదీ వద్దనుకుంటే మరొకటి. అవసరం కలిగితే మగవాడు పదిమంది పెండ్లాలను సునాయసంగా సంపాయించుకోగలడు. కానీ తల్లీదండ్రిని మాత్రం పొందలేడు. వాళ్ళ తర్వాతనే నాకెవరైనా! వాళ్ళకు కాని మనిషి నాకూ అక్కరలేదు"

అదీ ఆయనగారి పట్టు!

"అయితే నేను గాకపోతే ఇంకొకరన్నమాట"

"ఆ మాటేకదా నువ్వు చెప్పిస్తున్నది"

"కాదు నేను చెప్తున్నది నీయబ్బ చేసిన ఘనకార్యం"

మళ్ళీ నా చెంప ఛెళ్ళుమనింది!

"నీకు కాని మనిషి మీద చెయ్యిచేసుకొనే అర్హత నీకు లేదు"

"నా తండ్రిని పల్లెత్తు మాటంటే నేను సహించలేను"

ఆయన పట్టు ఆయన వదలలేదు. నా వాదన నుండి నేను వైదొలగలేదు.

మధ్యేమార్గం విడాకులు!

విడాకులంటే కోర్టులు... సాక్ష్యాలు... నిరూపణలు!

అబ్బా కొడుకులు అనుకుంటే నన్ను కోర్టుకెక్కించి నా నిస్సహాయత ఆదరువుగా ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించే వాళ్ళే!

ఎందుకో ఏమో వాళ్ళంత పనికి పూనుకోలేదు. బహుశా సంసారం గుట్టు రట్టవుతుందని.. వ్యక్తిత్వాల మీద దెబ్బపడుతుందని భయపడి ఉండవచ్చు. లేదా ఉద్యోగం చేస్తున్నాడు కాబట్టి నాకంటే అందమైన అమ్మాయిని కట్నాలు కానుకలతో తెచ్చుకోవచ్చని ఆలోచించి ఉండవచ్చు. ఏది ఏమైనా విడాకులకు ఒప్పుకున్నారు.

"మీసొత్తు నాకొక పూచికపుల్ల అవసరంలేదు. భరణం ఇవ్వాలని పట్టుబట్టడం లేదు. నేను తెచ్చింది మాత్రమే నాకివ్వండి." అని అడిగాను.

నా మాట కాదనకపోవడం నా అదృష్టమే!

ఇప్పుడు నేను పంచరంలో చిలుకను కాను. వినీలాకాశంలో రెక్కలు వచ్చిన పక్షిని. అలా అని ఇష్టం వచ్చినట్లు ఎగరదానికి వీలులేదు కదా? వయస్సు ఉంది. ఆ వయస్సు తగిన

అంతో ఇంతో అందముంది. తీరని కోరికలున్నాయి. చేతిలో డబ్బూ ఉంది. లేనిది ఒక్కటే భద్రత. అభద్రతా భయంతో ఆడది అడుగుముందుకు వేయడానికి జంకుతున్న ఈ రోజుల్లో ఒంటరి ప్రయాణం!

కత్తిమీద సామే. అప్పటికి అమ్మ గతించింది. తమ్ముడు వైద్య కళాశాలలో విద్యార్థిగానే కలవారింట్లో ఇల్లరికం అల్లుడై కూర్చున్నాడు. ఏకాకిగా మిగిలిన తండ్రిని వైరాగ్యం తన ఆలనా పాలనలోకి తీసుకొనింది. ఆయన విరాగుల్లో కలిసిపోయాడు.

ఇక నేను! నాకు నేనుగా మిగిలాను. నేను నా కోసం కాకుండా పదిమందికోసం బతికే మార్గం ఎన్నుకుంటే?

అది కేవలం కట్టుదిట్టమైన స్వయంకృషితోనే సాధ్యపడుతుంది. అందుకే నేను ఒక మారుమూల పల్లెలో తలదాచు కొన్నాను.

మనిషి మనుగడ డబ్బుతో ముడిపడి ఉంది. నా అవసరాలకు తగినంత డబ్బు నా వద్ద ఉంది. తింటూ కూర్చోవచ్చు. అప్పుడు నేను పదిమంది మనిషిని కాలేను. అందుకే పల్లెలో పిల్లలందరినీ చేరదీశాను. సాయంకాలంపూట వాళ్ళను చదివించడానికి మొదలుపెట్టాను. కేవలం చదివించడం వరకే పరిమితం కాకుండా ఆ పిల్లలందరికీ ఒక తల్లిగా ఆత్మీయానురాగాలను పంచిపెట్టే ప్రయత్నం చేశాను. అది ఫలించింది.

ఊరి దృష్టి నామీద పడింది.

సాయంకాలం పూట పిల్లలతో సరిపోతుంది. పగలంతా ఇంట్లో ఒంటరిగా గోళ్లు గిల్లుకొంటూ కూర్చుంటే ఏవేవో పనికిమాలిన ఆలోచనలు. వద్దన్నా వస్తుంటాయి. దాంతో లేనిపోని కలతలు కన్నీళ్ళు!

అందుకే నా దృష్టిని ఊరిమీదికి మళ్ళించాను.

నిజానికి ఏదో ఒక అవసరం లేనిమనిషి ఎవరూ ఉండరు. ఆ అవసరం నా అవసరంగా... ఆ కష్టం నా కష్టంగా పరిష్కారమార్గంలో పడేసరికి పరిస్థితులే మారిపోయాయి.

ఆ పల్లెకడుపులో తలదాచుకొన్నదాన్ని ఆ పల్లెకే తలలో నాలుక అయ్యాను. మొదట మొదట నన్ను గుచ్చిగుచ్చి చూసిన వాలుచూపులు వంకరచూపులు తీరులు మార్చుకొన్నాయి.

అదొక తృప్తి. అదొక ఆనందం. ఈ తృప్తి ఈ ఆనందం ఒక మగవాడి చేతిలో బొమ్మగా ఎన్ని సుఖాలు అనుభవించినా దక్కవేమో?

ఒక రోజు సాయంకాలం. ఇంటిముందు వరండాలో కూర్చొని పిల్లలను చదివిస్తున్నాను. ఇంటికి తూర్పు వాకిలి, సంజ వెలుగులు వరండాలో సరాగాలు పోతున్నాయి. ఆ వెలుగును అడ్డగిస్తున్నట్లుగా ఏదో నీడ చేతిలో పుస్తకంమీద పడింది. తల పక్కకి తిప్పిచూశాను.

గడప మెట్లెక్కుతూ ఆయనగారు!

నేను లేచి నిలబడ్డాను నాకు తెలియకనే. ఇదే ఆడదాని బలహీనత అని మళ్ళీ నాలుక కరచుకొన్నాను.

అంతలోనే ఆయన నేరుగా నా వద్దకు వచ్చారు. చేతిలో పూలూ పండ్లు నా ముందున్న టేబిల్ మీద పెట్టారు. నన్ను చూసీ చూడనట్లుగా చూస్తూ నిలబడ్డారు. ఆయన్ను ఆయన పెట్టిన పూలూ పండ్లను చూస్తూ ఒక్కక్షణం ఆలోచించాను.

"ఆ పండ్లు చేతికి తీసుకోండి. ఈ పిల్లలందరికీ పంచిపెట్టండి. ఆ పూలు తీసుకోండి. అదో అటుచూడండి. రాజారామ్‌మోహన్‌రాయ్... వీరేశలింగం పంతులు... గురజాడ! తమ వంట భావాలు కలిగిన మగజాతితో తెగతెంపులు చేసుకునే స్ఫూర్తిని నా వంటి అభాగ్యులకిచ్చిన మహానుభావులు. వాళ్ళ పాదాల దగ్గర ఉంచండి ఆ పూలు" అని చెప్పాలన్న ఆవేశం. కానీ ఈ మనిషికా ఆ అవకాశం?... ఛీ!' అని మనసు ఎదురుతిరుగుతూ ఉంది.

ఆయనగారు కూడా ఏదో చెప్పాలని మథన పడుతున్నాడు. చెప్పలేని నిస్సహాయత. అది ఆ చూపుల్లోనే తెలుస్తూ ఉంది.

మా మధ్య కొన్ని క్షణాలు కదలలేక కదిలినట్లు బరువుగా... మౌనంగా!

"నేను నిజాన్ని తెలుసుకొన్నాను" తనలోతాను గొణుక్కుంటున్నట్లుగా అన్నాడు.

"ఎప్పుడు? నా వలె మరొక అమ్మాయి మీ నాన్న నయవంచనకు బలైనప్పుడు!"

"అందుకే కదా! ఎప్పుడోపెట్టాల్సిన తలకొరివి ఇప్పుడేపెట్టేశాను. అందుకే క్షమించమని అడగడానికి వచ్చి నీముందు నిలబడ్డాను".

"చూడండి. మీరు చేసిన పనిలో అప్పుడు ఇప్పుడూకూడా ఆవేశమే ఉంది. ఆవేశంలో చేసిన పనికే పశ్చాత్తాప పడవలసిన అవసరం. అదే ఆలోచించి చేస్తే ఆ అవసరమే ఉండదు. మీరు ఇప్పుడు పెట్టారు తలకొరివి ఒక సంప్రదాయానికి కట్టుబడి కొడుకుగా తండ్రికి. నేను ఎప్పుడో పెట్టేశాను దేనికి?– మీ పురుషాహంకారానికి!"

మగతనంమీద మాడు పగిలే దెబ్బ!

అతని తల వాలిపోయింది.

అమాయకంగా మా ఇద్దరినీ మార్చిమార్చి చూస్తున్న నా పిల్లల సాక్షిగా నా గుండెబరువు దిగిపోయింది! ●

స్వాతిమాసపత్రిక
(1, జూలై 1998)